# సైభాష్

నల్లని మబ్బులు గుంపులు గుంపులుగా ముసురుతుంటే కృష్ణశాస్త్రి గారి పాట జ్ఞాపకం చేసుకుంటూ గ్రిల్‌కి తాళం వేసింది షాలిని - షాలినీ వల్లభుడు రెండు రోజులు ఆఫీస్ పని వుందని ఉదయం ఢిల్లీ వెళ్ళేడు. వెడుతూ వెడుతూ చెప్పిన వందన్నర జాగ్రత్తల్లో గ్రిల్‌కి తాళం వేసుకోమన్నది చాలా ముఖ్యమైనది.

తెలుగు గడ్డమీద పదిమందిగల కుటుంబంలో పుట్టి అల్లారుముద్దుగా పెరిగి, కాలేజీలో పెద్ద డిగ్రీ తీసుకున్న అమ్మాయి షాలినిని దేశం కాని దేశంలో, పూటకాని ఊళ్ళో ఉద్యోగంచేసే అతని కివ్వడం షాలిని నాయనమ్మకి అసలు ఇష్టంలేదు. దగ్గర్లో ఏదైనా సంబంధం చూడమని ఆవిడ కొడుకు చెవిలో ఇల్లు కట్టుకొని కూర్చుందేగాని కొడుకూ వినలేదు.

ఈ ఖడవ అసలే వినలేదు. ఏమైనాసరే ఆ పెద్దమీసాల వాణ్ణేగాని చేసుకోను పొమ్మంది. ఉదయం ప్రయాణం అయి వెడుతూ ఆ విషయాన్ని కూడా గుర్తుచేసేడు అతను. "నీకేమైనా జరిగిందంటే మీ నాయనమ్మకి నేను సమాధానం చెప్పలేను. కానీ, నువ్వు కూడా వచ్చెయ్ రాదూ!" అన్నాడు. అప్పుడు షాలినికి రోషం వచ్చింది.

"నేనేం అంత పిరికివాన్ని కాను. అస్తమానం నీ వెంటపడి రావడానికి" అనేసింది.

"సరే చూద్దాం" అని వెళ్ళిపోయేడు.

సాయంత్రంవరకూ బాగానే కాలక్షేపం అయింది.

కాపురానికని యిక్కడికి వచ్చిన ఆరు నెలల్లోనూ తీరుబడిగా కూర్చొని బట్టల బీరువా సర్దుకోడం, పుస్తకాలు సర్దుకోడం వంటి పనులేం చేయలేదు. ఈ రెండు రోజులూ హాయిగా వంట పని ఎగ్గొట్టేసి పుస్తకాలన్నీ సర్దుకోవచ్చు, స్నేహితురాళ్ళందరికీ ఉత్తరాలు వ్రాసుకోవచ్చు. "హాయిగా రెండు రోజులు నావి! అనుకుంది.

అయితే సాయంత్రం చీకటి పడిపోయిన తరువాత, క్వార్టర్ చుట్టూ పెరిగిన చెట్లు కొన్ని మనుష్యుల్లాగానూ, కొన్ని దొంగల్లాగానూ, కొన్ని దెయ్యాల్లాగానూ కనిపించాయి. విజయవాడలో అంతులేని సందడిలో వుండి వచ్చిన షాలినికి ఇప్పుడిక్కడ ఈ టౌన్‌షిప్ అంతా ఓ ఎడారిలా కనిపించింది. ఓ రిక్షా గంటల చప్పుడుగానీ, ఓ కారు హారన్ కానీ యేంలేదు. వుండీ వుండీ ఓ కారు, ఓ స్కూటర్ ఆగుతూన్న శబ్దం తప్ప ప్లాంట్‌నించీ క్వార్టర్స్‌కి వచ్చేపోయేవాళ్ళ తప్ప సంచారం వుండదాయె !

ఉండీ వుండీ ఓ మెరుపు, ఓ చిరువురుము, టప్ టప్‌మని చినుకుల సవ్వడి.

ఎందుకైనా మంచిదని యింటినిండా లైట్లు వేసేసి స్టీరియో ఆన్ చేసింది. అంటే ఇంట్లో మనుష్యులు చాలామంది వున్నట్లు అనిపింపజేయడానికి—

ఓ కుక్కని పెంచుదాం అంటే "కుక్కలు అంటే నాకు ఎలర్జీ నోయ్" అంటాడు అతను.

అతనివన్నీ మరీ వెనకబడిన భావాల్లా వుంటున్నాయి ఈ మధ్య.

అతనుంటే అస్తమానూ ఏ బ్రహ్మచారి స్నేహితుడినో భోజనానికి పట్టుకొస్తూ వుంటాడు. అందుకోసం ఏ రోజూ "సిక్స్ కోర్స్" భోజనం తప్పదు. కాని ఇవ్వాళ ఆ పటాటోపాలన్నీ వదిలేసి హాయిగా గోంగూర పచ్చడిలో మీగడ వేసుకొని తినెయ్యాలనుకుంది.

అందుకే ఇంకా వంట గదిలోకి వెళ్ళలేదు మధ్యాహ్నం పుస్తకాలు సర్దుదామని నడుం బిగించి కూర్చుంటే ముందుగా ముళ్ళపూడి పుస్తకాలు కనిపించాయి-రెండు మూడు ఓడ్ హౌస్‌లు కూడా దొరికాయి - ఇంక చదవడమేగాని సర్దడం ఆగిపోయింది- గదినిండా పుస్తకాలు చిందర వందరగా—ఇప్పుడేం తొందర రేపు సర్దుకోవచ్చులే అనుకుంది. వాకిట్లో ఏదో వాహనం ఆగింది—ఎవరో మరి—ఇప్పుడు ఎవరైనా చుట్టాలు వచ్చే టైమ్ కానీ, ఎవరూ వస్తామని వ్రాయలేదు. ఇంతదూరం పనిగట్టుకొని వచ్చే చుట్టాలూ లేరు.

అద్భుతగా బయట లైటు వేసింది. జరీగళ్ళ చీరె ఒక నల్లటి సూట్ కేసుతో గ్రిల్ దగ్గర నిలబడింది. నిలబడి బజ్జర్ నొక్కింది.

గ్రిల్‌కి నేమ్‌బోర్డు వ్రేలాడుతోంది. ఆవిడ మళ్ళీ బజ్జర్ నొక్కింది.

"అమ్మాయ్! ఉత్తరదేశంలో ఆడదొంగలు కూడా విపరీతంగా వుంటారట. వాళ్ళు రకరకాలుగా మోసాలు చేస్తారట, జాగ్రత్త. యెవరినీ ఇంట్లోకి రానివ్వకు" అన్న అమ్మ మాటలు గుర్తొచ్చాయి.

"ఎవరూ? ఎవరి కోసం?" అంది షాలిని తాళం తియ్యకుండానే.

"ఆనంద్ ఇల్లు ఇదేనా! తలుపు తియ్యండి చల్లుకొడుతోంది" అంది ఆవిడ.

ఒకవేళ బంధువేమో! తనకి తెలియని బంధువు లెవరబ్బా! పోనీ స్నేహితురాలా! ఇలాంటి స్నేహితురాలున్నట్టు యెక్కడా చెప్పలేదే! చల్లి పెద్దదైంది.

షాలిని బింకంగా తాళం తీసింది.

"ఆనంద్ లేడా?" అన్నది ఆవిడ లోపలికొస్తూ —

"లేరు. మీరు-మీరు-" అని ఆవిడ మొహంలోకి ఓ ప్రశ్నార్థకం విసిరింది.

ఆవిడ చీర చెంగుతో మొహం తుడుచుకొని, షాలినివైపు ఆశ్చర్యంతో చూసింది — ఆ పైన ఆవిడ కళ్ళల్లో ఓ వింత మెరుపు మెరిసింది.

"నువ్వెవరూ?" అన్నది ఓ నిమిషం ఆగి.

"బాగుంది-నేను మిసెస్ ఆనంద్‌ని-నా పేరు షాలిని —"

"అలాగా!" అని "జర్నీ చాలా టీడియస్‌గా వుంది - తలనొప్పి వచ్చింది-కాఫీ కావాలి" అన్నది.

"బంధువో, స్నేహితురాలో అయితే తనెవరో పరిచయం చేసుకోవచ్చుగా! అయినా, చూద్దాం ఏం జరుగుతుందో!" అని మళ్ళీ గ్రిల్‌కి తాళం పెట్టేసింది షాలిని. ఒకవేళ ఈవిడ వెనక యింకా ముఠా వుంటే వాళ్ళని రానివ్వకుండా వుండడానికి.

"తాళం వేస్తున్నావేం? ఆనంద్ ఇంటికి రాడా?"

"రాడు" అంటే తనకేమైనా చేస్తుందేమో! అందుకని "వస్తాడు. కానీ మాకు తాళం వేసుకోడం అలవాటు. నేను లోపల వుంటాను కదా! ఇక్కడ భయాలు ఎక్కువ" అని నాలుక కరుచుకుంది.

"చుట్టుప్రక్కలంతా మా స్నేహితులే. మా ఇంట్లో ఏ మాత్రం శబ్దం వినపడ్డా పరిగెత్తుకొని వస్తారు. ఎందుకైనా మంచిదని తాళం వెయ్యమంటాడు ఆనంద్."

అని లోపలికి వెళ్ళాలా, వద్దా అని అక్కడే నిలబడింది. అంతలో ఫోన్ మోగింది.

మూడు క్వార్టర్‌ల అవతలనుంచీ మిసెస్ మీనన్ ఫోన్‌చేసి అడి

గింది. "వంట చేసుకున్నావా? భయం లేకుండా వున్నావా? లేకపోతే మా కుట్టన్‌ని పంపించనా?" అని.

"వంట చేసుకోలేదు ఆంటీ-ఈ పూటకి వద్దనుకున్నా కాని, గెస్ట్ వచ్చింది-ఇంత చెయ్యాలి. కుట్టన్ వస్తానంటే పంపండి. ఏం తోచడం లేదు. కాసేపు ఏదైనా ఆడుకుంటాం, ఇక్కడే పండుకొని రేపు వస్తాడు" అని చెప్పి 'హమ్మయ్య' అనుకుంది.

"ఇప్పుడు నువ్వేం చెయ్యకు షాలినీ - మా ఇంట్లో ఈ రాత్రి డిన్నర్— చాలా పదార్థాలు చేశాను. కుట్టన్‌చేత నీకూ, మీ గెస్టుకీ కూడా పంపిస్తాను. అన్నం వండుకో" అని సలహా యిచ్చింది మిసెస్ మీనన్.

"అలాగే, ఆంటీ! థాంక్ యూ—" అని ఫోన్ పెట్టేసింది.

"గెస్ట్"గారు లోపలికి వచ్చి బెడ్‌రూంలో సూట్‌కేస్ పెట్టి, తడిసిన జరీగళ్ళచీరె మార్చి వాయిల్‌చీర ధరించింది. అప్పుడు చూస్తే ఆమెకి తన వయస్సే వుంటుందని గ్రహించింది షాలిని. ఇంత చనువుగా బెడ్‌రూం లోకి వచ్చింది- మొహం చూస్తే చదువుకున్న దానిలాగే వుంది — దొంగ అయి వుండదు-ఒకవేళ దొంగే అయితే ఇక్కడే రాత్రికి గదిలోవేసి తాళం పెట్టేసి రేపు ప్రొద్దున పోలీసులకి అప్పజెప్పడమే. కుట్టన్ వుంటే తనకేం భయం! వాడికి మీసాలొచ్చేయి, ఇంత పొడుగ్గా వుంటాడు. మహాస్మార్ట్‌గా వుంటాడు.

"మీకు కాఫీ అలవాటా? "టీ" కావాలా?" అని అడిగింది.

"కాఫీనే. రైల్లో టీ తాగి విసిగిపోయేను," అంటూ మంచంమీద చేరబడింది గెస్ట్. షాలిని కాఫీ తెచ్చి యిచ్చింది.

"మీరెవరో నేను గుర్తుపట్టలేదు మరి" అని మళ్ళీ అడిగింది.

"చెబుతాను. కొంచెం ఓపికపట్టు, అప్పుడే నిన్ను బాధపెట్టడం ఎందుకూ? గీజర్ ఆన్‌చేసి వస్తే స్నానం చేస్తాను. వాళ్ళంతా దుమ్ము — రోజున్నర ప్రయాణం!"

ఓహో! ఈవిడ మిస్ సస్పెన్స్ అన్నమాట. "నువ్వు-నువ్వు" అని ఏకవచనంలో సంబోధిస్తుంది!

"మాకు గీజర్ లేదండీ! హీటర్ మీద నీళ్ళు పెట్టి వస్తాన్లే" అని వెళ్ళింది.

అంతలో క్యారియర్‌తో కుట్టన్ వచ్చాడు.

అతను వస్తూనే షాలిని భయస్తురాలని ఆక్షేపించేడు - చేతినిండా మేగ్ జీన్లు — చ్యూయింగ్ గమ్ వగైరాలతో వచ్చేడు — మ్యాగ్‌జీన్లు టీపాయ్‌మీద పారేసి క్యారియర్ వంట ఇంట్లో పెట్టి. బబుల్ గమ్ నములుతు పేముకుర్చీకి చేరబడి జేబులో నుంచి "రూబిక్స్ క్యూబ్" తీసుకుని దాంట్లో లీనం అయిపోయేడు.

అంతలో "గెస్ట్" వరండాలోకి వచ్చింది. కుట్టన్ లేచి నిలబడి "నేను—బాలచంద్రమీనన్ ఇంట్లో కుట్టన్ అంటారు. తిరుచ్చి ఇంజినీరింగ్ కాలేజీలో సెకండ్ బి.ఇ. మరి మీరు" అన్నాడు.

గెస్ట్‌గారు మిశ్చీవస్‌గా నవ్వేసి. "నేను వీళ్ళ గెస్ట్‌ని. నాపేరు గిరిజ." అని మాత్రం వెల్లడించింది-అప్పుడే అక్కడికి వచ్చిన షాలినిని నిరాశలో ముంచివేస్తూ.

ఆ వెంటనే షాలిని కుట్టన్‌తో ఏదో మలయాళంలో చెప్పింది.

అతను మళ్ళీ గందరగోళంగా ఏదో జవాబు చెప్పి తల వూపేడు.

"నాకు మలయాళీ రాదు బాబూ" అంది గిరిజ.

"అమ్మయ్య" అనుకుంది షాలిని.

"నీళ్ళు కాగేయి స్నానం కానివ్వండి" అని గిరిజని హెచ్చరించింది.

"అవునూ ఆనంద్ రాలేదేం!" అంది గిరిజ.

"ఇవ్వాళ యింక రారేమో. రేప్రొద్దున వస్తారనుకుంటాను" అని నసిగింది.

గిరిజ లేచి తన సూట్‌కేస్ దగ్గరకు నడిచింది. అందులో నుంచి బట్టలూ, టవలూ తీసుకొని బాత్‌రూంకేసి బయలుదేరింది.

"మీ క్కావాలంటే షాంపూ కూడా అక్కడే వుంది. ఉపయోగించుకోండి" అని ఆవిడకి సలహా యిచ్చింది షాలిని,

గిరిజ బాత్‌రూంలోకి వెళ్ళి తలుపు వేసుకోగానే చప్పుడు కాకుండా బయట బోల్టువేసి ఆమె హ్యాండ్ బ్యాగ్ తెరిచింది. అందులో చిన్న డైరీ వుంది.

"మిస్ గిరిజ ఎం. ఏ; పి. హెచ్. డి. లెక్చరర్ ఇన్ ఎకనమిక్స్. ఎర్నాకుళం అని దానిమీద ఎడ్రస్ చదివింది. ఇక్కడ పని చేసే ఓ ఇంజనీర్ పేరు కూడా వుంది ఓస్లిప్ మీద.

ఇంకా నయం. జట్టన్‌తో తనేం ప్రమాదకరమైన విషయం మాట్లాడలేదు. తనకి మలయాళం రాదని అబద్ధం చెప్పింది. ఇదేదో దొంగ బావతు కాదు- అయినా ఈ ఎడ్రసులు ఎవరు నమ్ముతారు. సూట్‌కేస్‌లో గాని పిస్టల్స్, పాయిజన్ సీసాలు, కత్తులు, అలాంటివి వున్నాయేమో చూసేస్తే పోతుందిగా! గబ గబ సూట్‌కేస్ వెతికింది—అందులో ఎనిమిదో, పదో చీరెలు—వాటి తాలూకు జాకెట్లు, రెండు "ఆసిమోవ్"లు "ట్రిఫుల్" వున్నాయి.

ఖచ్చితంగా దొంగ కాదు-బట్టల అడుగున ఓ పుస్తకంలో కొన్ని డబ్బులున్నాయి- చెక్‌బుక్ మీద గిరిజ అని వుంది. స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎర్నకులం తాలూకు చెక్‌బుక్.

దొంగ కాదు కనుక ఇంక మర్యాద చెయ్యవచ్చు. తనకి పెళ్ళయిన ఈ ఆరు నెలల్లో తను చూడని బంధువులు ఆనంద్‌కి వుండకూడదూ! లేకపోతే స్నేహితురాలేమో! మళ్ళీ సూట్‌కేస్ యథాతథంగా సర్దేసి బాత్‌రూం బయట బోల్టు తీసింది.

"భోజనం చేద్దామా!" అన్నది కొంచెం కర్టెసీ గొంతులోకి తెచ్చుకొని.

"చేద్దాం-చేద్దాం నాకూ ఆకలిగానే వుంది. ఇంతకీ వంట ఏం చేశేవ్?" అంది డ్రెస్సింగ్ టేబిల్ దగ్గర కూర్చుని.

"చాలా ఉ సేను. టేబిల్ మీద పెట్టేస్తున్నా త్వరగా రండి భోజనం చేసి పేకాడుకుందాం. కుట్టన్‌ని అందుకే రమ్మన్నాను" అంది షాలిని.

స్నానంచేసి తెల్లని మాక్సీ వేసుకొని వచ్చిన గిరిజని చూస్తూ, "అందగత్తే" అనుకుంది షాలిని. వొంటిమీద పిసరు బంగారం లేక పోయినా, ఆవిడే బంగారంతో చేసిన బొమ్మలా వుంది.

గిరిజ మొహమాటం లేకుండా భోజనం చేసింది.

"మీరు ఎక్కడి నించీ వచ్చారు?" అని అడిగింది షాలిని భోజనం చేస్తూ—

"అమలాపురం నించే" అంది ఏమీ పట్టనట్లుగా గిరిజ.

"మీదీ అమలాపురమే అన్నమాట....అంటే మీరు ఆనంద్‌కి పెద్ద నాన్నగారి అమ్మాయా? మా పెళ్ళప్పుడు అమెరికాలో వున్నది మీరేనా?" అంది షాలిని ఆశగా.

"ఏం కాదు-నేనెవరో అన్నం తిని పడుకున్నాక చెబుతాను, ఏం? అంత కంగారు? అని రెప్పలు అల్లల్లాడించింది.

"నువ్వు చెప్పకపోతే నా కొచ్చిన ఇబ్బందేం లేదు, రేపు ఆనంద్ వచ్చాక ఎలాగూ తెలుస్తుందిగా" అనుకుంది షాలిని.

"నాకు నిద్ర వస్తోంది బాబూ - చాలా అలసిపోయాను - మీరు ఆడుకోండి" అని మంచం మీద పడుకుని సూట్ కేస్ తెరిచింది. అందులో నుంచీ "ట్రిపుల్" తీసుకొని చదవడం మొదలు పెట్టింది.

"పుస్తకం చాలా బావుంటుంది కదూ ఆంటీ. ఫెంటాస్టిక్" అన్నాడు కుట్టన్.

"అవును. నా కిలాంటి పుస్తకాలే యిష్టం" అని మళ్ళీ అందులో మునిగింది.

"ఈవిడ మీకేం అవుతారు ఆంటీ!" అని షాలినిని అడిగేడు కుట్టన్.

"ఆవిడ మిస్ సస్పెన్స్‌రా బాబూ! రేపు మీ అంకుల్ వచ్చాకగానీ తెలీదు" అంది షాలిని.

వరసగా రెండు ఆటలు ఓడిపోయి నిద్రపోతాననివరండాలో సోఫా పరిచేడు కుట్టన్. అతనికి రగ్గు కప్పుకోమని ఇచ్చి, గ్రిల్ కర్టెన్స్ దించి బెడ్‌రూంలోకి వచ్చింది షాలిని.

తలుపులు వేశాక ఈవిడ నన్నేమైనా చేస్తేనో అనుకుంది.

"ఆ! ఏం చేస్తుందిలే" అని నిర్లక్ష్యంగా నవ్వుతుని తనూ పడుకుంటూ,

"ఇందాకే నిద్రొస్తోందన్నారుగా" అంది.

"మరి నేనెవరో చెప్పలేకపోతే నువ్వు తెల్లవార్లూ సస్పెన్స్‌తో సతమతం అయిపోతావ్ కదా! అదేదో చెప్పేసి పడుకుందాం అనీ" అని షాలిని మొహంలోకి నిశితంగా చూసింది.

"నా కలాంటివేం లేవు. తకిమని క్షైంకి నిద్రొచ్చేస్తుంది. మళ్ళీ మెలకువ వచ్చాకే అన్ని విషయాలు. అందునా మిమ్మల్ని గురించి నాకేం సస్పెన్సు వుంఋంది-మమ్మల్ని బాగా తెలిసిన వారే అయి వుంటారు" అన్నది తనకేం కుతూహలం లేనట్టు.

"అవును, మీ ఆయన నాకు బాగా తెలుసు. చిన్నప్పటి నుంచీ కలిసి పెరిగాం, ఆడుకున్నాం, చదువుకున్నాం" అని గొంతు ఓ రకంగా మార్చేసింది.

"అహా! అంటే ఇరుగు పొరుగు వారన్న మాట."

"అదీకాదు. పెద్దయినాక కూడా అలాగే ఆడుకుంటూ, పాడుకుంటూ గడపాలని ఎన్నో కలలు కన్నాం, కానీ."

షాలిని గిరిజ మొహంలోకి పరిశీలనగా చూసింది. ఎంతో

గంభీరంగా వున్న ఆమె మొహంలో ఎక్కడో కాస్త చిలిపితనం తొంగి చూస్తుంది.

"కానీ-విధి వక్రించిందా!" అన్నది షాలిని జాలిగా.

"వక్రించబట్టేగదా! నేనుండవలసిన చోట నువ్వున్నావు?" అన్నది గిరిజ ఇంకా కొంచెం గంభీరంగా.

"ఏ.సీ-ఇప్పుడు మీ రాతలో ఆంతర్యం."

"ఆనంద్‌తో మాట్లాడాలి,"

షాలిని మరేం మాట్లాడలేదు-షాలిని ఏమైనా మాట్లాడుతుందేమో నన్నట్లు ఐదు నిమిషాలు ఎదురు చూసింది గిరిజ.

"మీరిద్దరూ యెందుకు పెళ్ళి చేసుకోలేదు? అని అడగవేం?" అంది తనే.

ఇప్పుడు కూడా షాలిని ఏం మాట్లాడలేదు. "అందం వున్నా చదువున్నా ఆడపిల్లకి వొరిగేదేంలేదు. తీరా పెళ్ళి దగ్గరి కొచ్చేసరికి కట్నం కావాలి. కట్నం నేనివ్వలేక పోయాను. నువ్వొచ్చావు కాబోలు అవునూ ఎంత తెచ్చేవ్? ఒక లక్ష? రెండా?"

షాలిని లేచి కూర్చుంది. కూర్చుని మొహంలో విచారం గూడు కట్టుకొనగా "మూడు" అన్నది.

"ఓహో? మూడు లక్షలతో వచ్చావన్న మాట. నిజం చెప్పు! నీ కన్నా నేను ఛాయ ఎక్కువ కదూ! నీ జడకన్న నా జడ పొడుగు కాదూ?

"అవునవును పాపం, మీకు అన్యాయం జరిగింది" అన్నది షాలిని దిగులుగా.

"ఇతనితో తిరిగానని నాకు పెళ్ళి కాలేదు."

"అవును అన్ని కష్టాలూ ఆడపిల్లలకేగా"

"చూడు నువ్వు మాత్రం - నీ మగడు పెద్ద ఉద్యోగస్తుడని-చదువు కున్నవాడని మంచివాడని నమ్మి పెళ్ళి చేసుకున్నావ్ కదా!

అంత చరిత్ర అతని వెనక వుందనీ, మనస్సు ఒకరికిచ్చి కట్నం కోసం నిన్ను పెళ్ళి చేసుకున్నాడని తెలిస్తే ఎంత కృంగిపోతావు! అసలు ఈ రాత్రికి నిద్రపోతావా? తిండి తినగలవా! మనసులేని కాపురం ఏం కాపురం!" గిరిజ పుస్తకం అవతల పెట్టి షాలిని వైపు జాలిగా చూస్తూ అంది."

"మీకిచ్చిన మనసుని ఆయన మళ్ళీ వెనక్కి తీసుకొని నాకిచ్చేసాడు! అనబోయి నాలుక కొరుక్కుని.

"అవునవును. మనద్దరికీ అన్యాయం జరిగింది" అన్నది షాలిని.

గిరిజ కళ్ళల్లో కొంచెం ఆశ్చర్యం కదిలి వెంటనే అదృశ్యం కావడం షాలిని కనిపెట్టింది.

"నీ పెళ్ళి జరిగిందని విన్నాక నాకెంత కోపం వచ్చిందో తెలుసా? నా గతేమిటని అడిగి కోర్టుకి వెడదామని అనుకున్నాను."

"మరి ఇన్నాళ్ళ ఆగారేం?"

"ధైర్యం కూడగట్టుకోడానికి ఇన్నాళ్ళు పట్టింది. పెద్దవాళ్ళకి పెద్దవాళ్ళకి తెలిస్తే ఇలా రానిస్తారా అసలు వస్తూనే తలుపు దగ్గర నిలేసి నువెవ్వరు అని అడిగిన నిన్ను చూస్తే నాకు వొళ్ళు మండింది-నేను వుండ వలసినస్థానంలో నువ్వున్నవు-అందుకే ఆ కోపంలో నిన్నేంచేస్తానో అని పించింది.ఇంకా నయం ఎలాగో తమాయించుకున్నాను కనుక సరిపోయింది-లేకపోతే ఈపాటికి నీ సంగతి ఎలా వుండేదో!"

"నాకేం భయం లేదండీ - నేను మా బెజవాడలో కరాటే నేర్చు కున్నాను" చెక్కు చెదరకుండా మంచం మీద పడుకొని జవాబిచ్చింది షాలిని.

"సరి ఇప్పుడు మీ ఆయన మీద నీకు అసహ్యం వెయ్యడం లేదూ? నువ్వు కూడా ఏదో కాస్త చదువుకున్నట్టే కనిపిస్తున్నావ్."

"మీ లాడాక్టరేట్ లేదుగానీ ఏదో కొద్దిగా ఎం. ఏ. సైకాలజీ చదివాను."

"అవునవును. ఇందాక బాత్‌రూం బయట బోల్టువేం నా సూట్ కేస్ తనఖీ చేశావుగా! అప్పుడు నేను దొంగనికాదనీ, చదువుకున్నదాన్ననీ గ్రహించి కాస్త స్థిమిత పడ్డావు అవునా?"

షాలిని ఆశ్చర్యంగా చూసింది.

"ఏం లేదులే. నేనెవరో తెలుసుకోవాలనే కుతూహలంతో నా పెట్టె తెరిచావు. త్వరగా సర్దేయాలనీ కంగారులో కొంచెం అక్కడివి యిక్కడా, యిక్కడివి అక్కడా సర్దేశావు. అంతే. నాకు జ్ఞాపకశక్తి చాలా యెక్కువ" అంది గిరిజ.

షాలిని మౌనం వహించింది. ఈమె తనని దోచుకోడానికి వచ్చిన దొంగకాదని యిందాక దృఢపరుచుకుంది. కానీ కథని యిప్పుడు క్రొత్త మలుపు తిప్పింది.

"ఏమిటి ఆలోచిస్తున్నావ్ ! ఇంతకాలంగా నీ భర్త నీతో యెంత చక్కగా నటించాడు అనా?" అన్నది గిరిజ.

షాలిని ఓ అయిదు నిమిషాలు ఆలోచించింది.

"సారీ షాలినీ, నిన్నిలా బాధపెడతానని అనుకోలేదు. కానీ ఏం చేస్తాం. తప్పదు మరి, నా సంగతి నేను చూసుకోవాలి కదా !" అంది గిరిజ.

అప్పటికి షాలిని మాట్లాడలేదు.

"ఏం మనిద్దరం ఇక్కడ ఎడ్జెస్ట్ కాలేం అంటావా ?" అంది గిరిజ మళ్ళీ.

ఈసారి షాలిని నవ్వి.

"ఎందుకు కాలేం. తప్పకుండా అవుతాం ఈ వంటపనీ, ఇంటిపనీ చెయ్యలేక చచ్చిపోతున్నాను. కొంచెం ఎసిస్టెన్స్‌వుంటే నాకు బాగానే వుంటుంది" అంది.

"నాకు వంట చెయ్యడం రాదే!" అంది గిరిజ కొంచెం విచారంగా.

"ఇంక చాలుగానీ నిద్రపోండి— తెల్లవారి మాట్లాడుకుందాం-" అంది షాలిని కళ్ళు మూసుకుని.

"నువ్వు చూస్తే గట్టిదానిలాగే వున్నావు. ఇంత విషాదాన్ని దాచుకుని దిగుల్లేకుండా ఎలా నిద్రపోతావో ఏమో!" అని జాలిపడింది గిరిజ.

"నాకు దిగులు అంటే తెలీదు గిరిజగారూ. రేపటిగురించి అసలు ఆలోచించను. ఇవ్వాళ మంచి కథచెప్పి కాలక్షేపం చేశారు. థాంక్స్. మీకో సలహా చెప్పాలని వుంది" అంది షాలిని.

"చెప్పు" అంది గిరిజ.

"ఎవర్నైనా ఏడిపించాలనుకోడం నాకూ సరదాయే కానీ, ఇలాంటి ప్రమాదకరమైన జోక్స్‌తోనూ, ఎక్స్‌పెరిమెంట్లతోనూ కాదు. ఒక్కొక్కప్పుడు అవి యిద్దరికీ చెడుపు కలిగిస్తాయి. నేను మీరు చెప్పినట్లు గట్టిదాన్ని కనుక సరిపోయింది. ఇంకొకరైతే ఎంత సెంటిమెంటల్‌గా, సెన్సిటివ్‌గా ఆలోచించి త్వరపడి నిర్ణయాలు తీసుకుంటారో ఆడపిల్లలు ఆలోచించండి— టీజింగ్‌కి కూడా కొన్ని పరిమితులున్నాయి. అవునా? అంది. గిరిజ విస్మయంతో షాలినిని చూసింది. ఆ చూపులో విస్మయంతో పాటు అభినందన కూడా వుందని షాలిని గ్రహించింది.

"ఇది టీజింగ్ అని ఎందుకనుకుంటున్నావు?" అంది బింకంగా గిరిజ.

"నా కారణాలు నాకున్నాయి. నేను ఆనంద్‌ని ఎంత సన్నిహితంగా

తెలుసుకున్నానో నాకు తెలుసు- అంతేకాదు, ఏదీ ఆలోచించి నిలకడమీద తెలుసుకోవాలనే నిబ్బరం నాకు మా నాన్న నేర్పారు— మాది కట్నంలేని పెళ్ళి అనీ, పూలదండల పెళ్ళి అనికూడా బంధువర్గంలో అందరికీ తెలుసు. కాబట్టి మిస్ గిరిజా! నువ్వు ఎవరో నాకిప్పుడు చెప్పకపోయినా ఇబ్బంది లేదు. ఆనంద్ వచ్చాకే తెలుసుకుంటానుగానీ, ఇలాంటి కథలు చెప్పక హాయిగా నిద్రపో" అంది షాలిని.

"సెభాష్ షాలినీ. నిన్ను గురించి ఆనంద్ తెగ పొగుడుతూంటే ఏమో అనుకున్నాను. నీలాంటి వ్యక్తి దొరకడం ఆనంద్ అదృష్టం. ఇంక సస్పెన్స్ ఎందుకుగానీ, నేను ఆనంద్ చిన్న మామ గోపాలకృష్ణయ్యగారి రెండో అమ్మాయిని. ప్రస్తుతం యిక్కడ చిన్నపని వుండి వచ్చాను" అని షాలిని భుజం తట్టింది గిరిజ,

"ఆ పనేమిటో నాకు తెలుసులే. ఇక్కడో ఇంజనీర్‌తో నీకు పెళ్ళి మాటలు జరుగుతున్నాయి. అతన్ని గురించి తెలుసుకోవాలని వచ్చావు. అవునా? మరి నేను అతనికి చెప్పేస్తాడు. ఈవిడ మా ఆయన మాజీ ప్రియురాలండీ. ఈవిడ మనస్సు యెవరికో యిచ్చి మీతో పెళ్ళికి సిద్ధ పడుతోందీ అని."

"నీ తెలివికి వెయ్యి నమస్కారాలు తల్లీ. ఆ పని చెయ్యకు" అని షాలిని బుగ్గమీద గిరిజ చిటికె వేస్తుండగా బజ్జర్ మ్రోగింది.

"ఆంటీ మీకు టెలిగ్రాం" అని కుట్టన్ తలుపు కొట్టి అరుస్తున్నాడు.

"అది నేను వస్తున్నట్టు—సీవ్ రిచేసుకోమని మూడు రోజుల క్రిందట యిచ్చిన టెలిగ్రాం అయివుంటుంది. అది చేరకపోవడం వలన...." అంటోంది గిరిజ.